క్లుప్తంగా

విశేషంగా ఏకాదశి తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై శనివారం సాయంత్రం విశేషంగా తిరువీధి నిర్వహించారు. మదనగోపాలస్వామి ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకిలో అధిష్టింపజేశారు. సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించి విశేషంగా హారతులు అందజేశారు. భక్తులు తిరువీధిలో స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

ఘనంగా శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడి వర్ధంతి



శంకరరావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కృష్ణకుమార్

సింహాచలం: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపకుడు ఆత్మకూరి శంకరరావు 11 వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి ఆవరణలోని శంకరరావు విగ్రహానికి శంకర్‌ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణకుమార్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ఉద్యోగులు, వైద్యులు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి అడ్మిన్ అండ్ ఆపరేషన్స్ జీఎం కె.రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు ప్రవాహానికి దారేది?



వెన్నలపాలెం రైస్ మిల్లు వద్ద పూడికలతో కల్వర్టు

పరవాడ: వెన్నలపాలెం గ్రామంలో మురుగు ప్రవహించడానికి ఏర్పాటు చేసిన కల్వర్టు చెత్త చెదారాలతో పేరుకుపోయింది. దీంతో మురుగునీరు ప్రవహానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు చెప్పారు. రైస్ మిల్లు వద్ద మురుగు నీరు పారడానికి ఏర్పాటు చేసిన కల్వర్టులో ఎగువ నుంచి వచ్చిన చెత్త చెదారాలు పేరుకుపోవడంతో మురుగు నిలిచిపోతోంది. ఫలితంగా భరించలేని దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమల బెడద మరింత పెరిగిందని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కల్వర్టులో పేరుకుపోయిన పూడికలు తొలగించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గూడ్స్ రైలు ఢీకొని వృద్ధుడి మృతి

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం రైల్వే గేటు సమీపంలో ట్రాక్ దాటుతుండగా విజయనగరం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న గూడ్స్‌రైలు ఢీకొనడంతో పెందుర్తి మండలం దువ్వపాలెం గ్రామానికి చెందిన చిట్టిబోని రాము (64) శనివారం మృతి చెందాడు. మంగళపాలెంలో తనకు తెలిసిన వారి ఇంటికి వచ్చి గేదెలు కట్టే కన్నెలు కొనుగోలు చేసి ట్రాక్ దాటుతుండగా ప్రమాదానికి గురయ్యాడు. విశాఖపట్నం, కొత్తవలస రైల్వే ఎస్‌ఐలు శ్రీనివాసరావు, వికాస్‌నాయక్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. శవపంచనామా జరిపి కేసు నమోదు చేశారు.

బిల్డింగ్‌పై నుంచి పడి పెయింటర్ ..



భాస్కర్ మృతదేహం

సింహాచలం: బిల్డింగ్‌పై నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి పెయింటర్ మృతి చెందాడు. జీవీఎంసీ 93వ వార్డు పరిధి శ్రీనివాసనగర్‌లో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. రామాటాకీస్ సమీపంలోని రేసపువానిపాలెంలో ఉంటున్న ఎం.భాస్కర్(43) శ్రీనివాసనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఒక భవన పెయింటింగ్ పనులకు వచ్చాడు. శనివారం ప్రమాదవశాత్తూ జారిపడ్డాడు. వెంటనే అతన్ని అడవివరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందాడు. పెందుర్తి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్టార్టప్ ఇండియాతో కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహం



జీఎస్ గిరిధరన్‌ను సత్కరిస్తున్న వీసీ డాక్టర్ సూర్యప్రకాష్

సబ్బవరం: బహుళ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహంతోనే దేశం ఆర్థికాభివృద్ధి వైపు దూసుకుపోతుందని దక్షిణాసియా ఎల్‌పీజీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ జీఎస్ గిరిధరన్ తెలిపారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలోని లీగల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై శనివారం విబోధ పేరుతో వర్కుషాపు నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్టార్టప్ ఇండియాలో భాగంగా ప్రభుత్వం పరిశ్రమ ప్రారంభించే మూడేళ్ల పాటు పన్నులు, తనిఖీల్లో పూర్తిగా సడలింపు ఇస్తుందని చెప్పారు. ప్రభుత్వం ఆదాయం కంటే నైపుణ్యం, ఆసక్తి కలిగిన వ్యక్తులు పరిశ్రమలు ఏర్పాటు చేసే విధంగా ప్రోత్సహిస్తుందన్నారు. రిస్క్ తీసుకుని స్పష్టమైన రోడ్ మ్యాప్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. వీటిని స్థాపించేవారిలో ఉండే ఆలోచనలు,అభిరుచిని గుర్తించి స్టార్టప్‌లను ప్రోత్సహించడం ద్వారా వారితో పాటు పనిచేసేవారికి మంచి జీవనోపాధి లభిస్తుందన్నారు.

కార్యక్రమంలో లీగల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహించేందుకు వర్సిటీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా 35 మంది వరకూ పలు విశ్వవిద్యాలయాల విద్యార్థులతో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదనరావు, అకాడమీ అండ్ రీసెర్చ్ డైరెక్టర్ దయానంద మూర్తి, వర్సిటీ ఫ్యాకల్టీ డాక్టర్ నందిని తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా తోడ పెద్దుల పాలకొలుపు



తోడపెద్దు పాలకొలుపులో పాల్గొన్న రాష్ట్ర యాదవ సంఘ ప్రతినిధులు



విజేతలు, అతిథులకు జ్ఞాపికలు అందజేస్తున్న నిర్వాహకులు

పరవాడ: పెదముషిడివాడ గ్రామంలో శ్రీ వేణుగోపాల యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తోడ పెద్దు పాల కొలుపు కార్యక్రమాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 12 తోడపెద్దులు, గరిడీలు వచ్చి పాలకొలుపు లో పాల్గొని అలరించాయి. రాష్ట్ర యాదవ సంఘ అధ్యక్షుడు లాకా వెంగళరావు మాట్లాడుతూ యాదవ సంఘ ఆధ్వర్యంలో ఎన్నడూ లేని విధంగా తోడపెద్దు పాలకొలుపు భారీ ఎత్తున నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల సంస్కృతి భావి తరాలకు తెలుస్తుందని చెప్పారు.ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తే తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. తోడపెద్దులతో నిర్వహించిన గరిడీలు ఆకట్టుకున్నాయి. పరిసర గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలను సంఘ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర గొర్రెల పెంపకం దార్ల సంఘ ఛైర్మన్ వై.నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు వై.నూకాలమ్మ, అనకాపల్లి జిల్లా యాదవ సంఘ అధ్యక్షుడు భరిణికాన బాబూరావు యాదవ్, గ్రామ సర్పంచ్ పల్లా నాగమణి, పల్లా అప్పారావు(కబడ్డీ), మండల యాదవ సంఘ అధ్యక్షుడు బందం వెంకటరమణ, ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు, పలువురు పెద్దలు పాల్గొన్నారు.

సేవారంగ పరిశ్రమలకు 30 శాతం సబ్సిడీ



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏడీ డాక్టర్ పద్మ, చిత్రంలో డీఆర్‌డీఏ పీడీ శోభారాణి

మహారాణిపేట: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఖాదీ,గ్రామీణ పరిశ్రమల మండలి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.పద్మ అన్నారు. చిన్న తరహా పరిశ్రమలు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసుకొని ఉపాధి అవకాశాలు పొందాలని ఆమె సూచించారు. పెందుర్తిలోని మహిళా ప్రాంగణంలో శనివారం ఖాదీ బోర్డు ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడీ పద్మ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. సేవారంగ పరిశ్రమలకు 30 శాతం వరకు సబ్సిడీ ఉంటుందని, బ్యాంకులు కూడా రుణాలు మంజూరు చేయడానికి ముందంజలో ఉన్నాయని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, ఏపీడీ రమేష్, సుశీల్,ఆనందరావు, పలు బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులుకు చెక్కు అందజేస్తున్న దాత రమణారెడ్డి



పీఆర్‌వో సునీల్‌కు చెక్కు అందజేస్తున్న దాత చైతన్య కృష్ణతేజ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరంలోని ఆర్కే బీచ్ ప్రాంతానికి చెందిన వెంకటరమణారెడ్డి అనే దాత లక్షా 1116లు విరాళంగా ఇచ్చారు. ఆలయంలో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులకు సంబంధిత చెక్కు అందజేశారు. ఆలాగే ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడికి చెందిన చైతన్య కృష్ణతేజ అనే దాత రూ. లక్ష విరాళాన్ని సింహగిరిపై మే ఐ హెల్ప్ యు కేంద్రంలో పీఆర్వో సునీల్‌కు చెక్కురూపంలో అందజేశారు. దాతలకు స్వామి దర్శనం కల్పించారు.

కార్మికుల హక్కులకు భంగం కలిగితే సహించం



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: కార్మికు హక్కులకు భంగం కలిగితే సహించేది లేదని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా ఉత్పత్తికి తగ్గ ఇన్సెంటివ్ చెల్లించకపోవడం, ఎల్‌టీసీ నిలుపుదల చేయడం వంటి కారణాల వల్ల కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. అదే విధంగా అన్ని విభాగాల్లో కార్మికులు పదవీ విరమణ చేయడం, మృతి చెందడం వల్ల సిబ్బంది తగ్గిపోతున్నారని తెలిపారు. వెంటనే యాజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, కొవిరి అవతారం, బీఎంకె నాయక్, ఎస్.ఎ. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆపే వరకు ఉద్యమం



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకు తమ ఉద్యమాలు కొనసాగుతాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాటికి 765వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో పలువురు కార్మికులు పాల్గొని, కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు ఉక్కు కార్మిక వర్గం ఎంతగానో శ్రమించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించడమే కాక, ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ ప్లాంటును నష్టాల ఊబిలోకి నెట్టి ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ



పెందుర్తి భవిత కేంద్రంలో విద్యార్థులతో మాట్లాడుతున్న అబ్దుల్ ఆషా

విశాఖ విద్య: ప్రత్యేక అవసరాల పిల్లల ఆరోగ్య పరిరక్షణకు తగిన శ్రద్ధ తీసుకుంటున్నట్లు సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ అబ్దుల్ ఆషా తెలిపారు. జిల్లాలోని అన్ని భవిత కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. వైకల్యం గల పిల్లలకు ఫిజియోథెరపి సేవలను సైతం అందిస్తున్నామన్నారు. పెందుర్తి భవిత కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రాల్లో చదువుతో ఆరోగ్య పరమైన సేవలు అందిస్తామన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి



జస్టిస్ శేషసాయికి స్వాగతం పలుకుతున్న పి.నరసింగరావు

విశాఖ లీగల్: న్యాయసేవ ప్రాధికార సంస్థ, ఉచిత న్యాయసేవలు, చట్టాలపై న్యాయవాదులు, ప్రజలకు అవగాహన అవసరమని రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, లోక్ అదాలత్ రాష్ట్ర చైర్మన్ జస్టిస్ ఆకుల శేషసాయి అన్నారు. శనివారం ఆయన్ని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి.నరసింగరావు, మెట్రోపాలిటిన్ సెషన్ జడ్జి ఎం.రమణారావు, లోక్ అదాలత్ జాతీయ శిక్షకులు రఘుపాత్రుని శ్రీనివాసరావు కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు న్యాయమూర్తితో పలు అంశాలపై చర్చించారు. గత ఏడేళ్లలో ఆరు వేల మంది న్యాయవాదులకు శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. వచ్చే రోజుల్లో మరిన్ని శిక్షణ తరగతులను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని న్యాయమూర్తి సూచించారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) పథకంలో భాగంగా జిల్లాలోని 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేట్ ఎలక్ట్రీషియన్‌లో 90 సీట్లు ఉన్నాయని, పదో తరగతి, ఐటీఐ ఆపైన పాసైన వారు అర్హులని పేర్కొన్నారు. అసిస్టెంట్ ప్లంబర్ జనరల్‌లో 8వ తరగతి, ఐటీఐ ఆపైన పాసైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అసోసియేట్ మేసన్ కోర్సులో 60 సీట్లు ఉన్నాయని, ఐదో తరగతి పాసైన వారు అర్హులని తెలిపారు. పెదగంట్యాడలోని తమ కార్యాలయంలో శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో స్టేషనరీని ఉచితంగా అందజేస్తామని తెలియజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సంబంధిత రంగంలో (ప్రైవేట్ సెక్టార్లలో) ఉపాధి కల్పిస్తామని, శిక్షణ కోసం ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ కార్యాలయంలో గానీ లేదా 83090 03957, 91332 42666, 94903 91324 నంబర్ల ద్వారా ఫోన్‌లో గానీ సంప్రదించాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వినతి



రవిబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబుకు వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, అధ్యక్షుడు బి.తౌడన్న ఆధ్వర్యంలో నాయకులు ఆయన్ను శనివారం కలిసి, ఉద్యోగుల సమస్యలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా కృషి చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించాలని ఆయనను కోరారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. సత్యనారాయణ, డి. పుల్లారావు, ఎస్. మోహన్‌బాబు, కె.వి. రత్నం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న ఆర్జిత సేవలు



స్వర్ణతులసీ దళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, ఆలయ సిబ్బంది



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు, పాల్గొన్న భక్తులు

సింహాచలం: ఏకాదశి పురస్కరించుకుని వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8గంటల వరకు స్వర్ణ తులసీ దళార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీ స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణ తులసీ దళాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి పూజ చేశారు. ఆలయ సూపరింటెండెంట్ నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కల్యాణం.. కమనీయం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.అలాగే పండితులు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు.

విశేషంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

డాక్టర్ కనకప్పారావు



పరవాడ: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ కనకప్పారావు సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో శనివారం ఆయన్ను కలిసిన విలేకరులతో మాట్లాడారు. వ్యాధుల కట్టడికి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ఎంతో అవసరమన్నారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి ప్రమాదకర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా సిబ్బందికి సూచనలు చేశామని చెప్పారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో చెత్త చెదారాలను తొలగించడంతో పాటు తాగి పారేసిన కొబ్బరి బొండాలు, అరటి తొక్కలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. నిల్వ నీటిని వినియోగించకుండా మంచి నీటిని ఉపయోగించుకోవాలని సూచించారు.

తక్షణ వైద్యం : పీహెచ్‌సీ పరిధిలో సీజనల్ ఫీవర్లతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి తక్షణ వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సీజనల్ జ్వరాలపై సర్వే నిర్వహించడానికి సిబ్బందికి సూచనలు చేశామన్నారు. గ్రామంలో కాలువల్లో దోమల వృద్ధి చెందకుండా దోమల మందులు పిచికారీ చేయాలని పంచాయతీ అధికారులకు సూచించామని చెప్పారు. చెత్తా చెదారాలతో నిండిన కాలువలను గుర్తించి పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించాలని సూచించారు. ప్రస్తుతం పీహెచ్‌సీ పరిధిలో అక్కడక్కడ గుర్తించిన వైరల్ జ్వరాలతో బాధపడుతున్న రోగులకు వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. వైరల్ ఫీవర్లతో బాధపడుతున్న వారు పీహెచ్‌సీకి కువచ్చి మెరుగైన వైద్యసేవలు పొందాలని డాక్టర్ కనకప్పారావు ప్రజలకు సూచించారు.

గృహ నిర్మాణాలు సకాలంలో పూర్తి



ఎర్రవానిపాలెంలో నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి కిరణ్‌కుమారి

సబ్బవరం: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి కిరణ్ కుమారి సూచించారు. మండలంలోని అసకపల్లి శివారు యర్రవానిపాలెంలోని జగనన్న లే అవుట్‌లో శనివారం గృహనిర్మాణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నిర్మాణాలు వేగవంతం చేసే విధంగా లబ్ధిదారులను ప్రోత్సహించడంతో పాటు కాలనీలో అన్నిరకాల వసతులు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ నాయుడు, హౌసింగ్ ఏఈ శేఖర్‌నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమబిందు, వెలుగు ఏపీఎం సాయి రమేష్‌తో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతర అధ్యయనంతో సత్ఫలితాలు



ఎన్‌వీపీ న్యాయ కళాశాల విద్యార్థులతో శ్రీనివాసరావు తదితరులు

విశాఖ, లీగల్ : న్యాయ విద్యార్థులకు నిరంతర అధ్యయనం అవసరమని విశాఖ జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి కేకేవీ బులికృష్ణ అన్నారు. శనివారం నగరంలోని వివిధ న్యాయ కళాశాలలకు చెందిన విద్యార్థులతో న్యాయమూర్తి వివిధ అంశాలపై ముచ్చటించారు. న్యాయవాదులు ఉన్నతంగా ఎదగడానికి పుస్తకాలతో పాటు కోర్టులో కేసుల విచారణ, సీనియర్ న్యాయవాదుల వాదనలు విని ఆకళింపు చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్ జాతీయ శిక్షకుడు, సీనియర్ న్యాయవాది రఘుపాత్రుని శ్రీనివాసరావు మాట్లాడుతూ కళాశాలల్లో నేర్చుకున్న అంశాలను, న్యాయస్థానాల్లో తీర్పులు, సీనియర్ల వాదనలు అవగాహన చేసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలను అన్వయించే విధానాలను గ్రహించాలని సూచించారు. లోక్ అదాలత్ సేవలు, ఉచిత న్యాయ సహాయం, సంబంధిత చట్టాలను వివరించారు.

త్వరితగతిన నగర సుందరీకరణ పనులు

- జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు ఆదేశం



రైల్వే స్టేషన్ రోడ్డులో సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్: నగర సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం షీలానగర్, ఎయిర్‌పోర్ట్, ఎన్ఏడీ జంక్షన్, మర్రిపాలెం, మురళీనగర్, తాటిచెట్లపాలెం, తెలుగుతల్లి ఫ్లై ఓవర్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీ20 సదస్సుకు ఎంతో మంది దేశ విదేశీ ప్రతినిధులు వస్తున్నందున, వారికి ఆహ్లాదం కలిగించేలా నగర సుందరీకరణ పనులు చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా ప్రధాన మార్గంలోని బారికేడ్ల వద్ద వినియోగంలో లేని కేబుల్ వైర్లు తొలగించాలని, అవసరమైన వైర్లను క్రమబద్ధీకరించాలని, అనుమతి లేని ప్రకటన బోర్డులు తొలగించాలని అధికారులను ఆదేశించారు. రైలింగ్‌కు పెయింటింగ్ రెండో సారి వేయాలని, సెంట్రల్ మీడియంలో మొక్కలు, వాటి మధ్య ఖాళీలు అక్కడక్కడ ఉన్నాయని, ఆ ప్రాంతంలో కొత్తవి నాటాలన్నారు. పాత సూచిక బోర్డులను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని, బస్ షెల్టర్లను ఆధునికీకరించాలని, మొక్కలను ట్రిమ్ చేస్తూ, ప్రధాన రహదారి పొడుగునా ఉన్న ప్రతి మొక్కకు రోజూ నీరు పోయాలన్నారు. మర్రిపాలెంలోని 24/7 తాగునీటి ప్రాజెక్టును పరిశీలించేందుకు అతిథులు ఆ ప్రాంతాన్నిసందర్శిస్తారని తెలిపారు. పర్యటనలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, హార్టికల్చర్ డీడీ దామోదరరావు, జోనల్ కమిషనర్లు ఆర్.జి.వి.కృష్ణ, సింహాచలం, మల్లయ్యనాయుడు, పర్యవేక్షక ఇంజినీర్ కె.వేణుగోపాలరావు, డీసీపీ సంజయ్య పాల్గొన్నారు.